మెయిన్

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 31
పేజీలు : 4

సోమవారం 18.08.2025

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్



**టీ మీడియా,ఆగస్టు 17,న్యూఢిల్లీ:**
ఎన్డీయే రాష్ట్రపతి అభ్యర్థి ఎవరనే ఉత్కంఠ వీడింది. మహారాష్ట్ర గవర్నర్ చంద్రాపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్ ను ఉపరాష్ట్రపతి పదవికి తమ అభ్యర్థిగా నేషనల్ డెమొక్రటిక్ అలయెన్స్ ప్రకటించింది. జగ్దీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేయడంతో ఉప రాష్ట్రపతి ఎన్నిక అనివార్యమైంది. ఉప రాష్ట్రపతి ఎన్నిక సెప్టెంబర్ 9న జరగాల్సి ఉండగా, ఆగస్టు 22వ తేదీతో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగుస్తుంది.సీపీ రాధాకృష్ణన్ ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్నారు. గతంలో కోయంబత్తూరు ఎంపీగా పనిచేశారు. జారండ్, తెలంగాణ గవర్నర్‌గా కూడా సేవలందించారు. 1957 మే 4న రాధాకృష్ణన్ జన్మించారు. తమిళనాడులోని కోయంబత్తూరు లోక్‌సభ స్థానం నుంచి రెండుసార్లు బీజేపీ ఎంపీగా ఎన్నికయ్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. తమిళనాడులో బీజేపీ బలోపేతానికి విశేష కృషి చేశారు.పార్టీ ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎంపికను ఖరారు చేసేందుకు బీజేపీ పార్లమెంటరీ బోర్డు ఆదివారంనాడు సమావేశమైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా, హోం మంత్రి అమిత్‌షా తదితర అగ్రనేతలు పాల్గొన్నారు. సమావేశానంతరం సీపీ రాధాకృష్ణన్ నామినేషన్‌ను జేపీ నడ్డా ప్రకటించారు. ఎన్డీయే అభ్యర్థికి విపక్షాలు సైతం తమ మద్దతు తెలుపుతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

# నిర్వాసితుల పోరాటానికి మద్దతు

## సమస్యలను చట్టసభల్లో ప్రస్తావించని వైసిపి, టిడిపి
## సిపిఎం కార్యదర్శి ఎం ఏ బేబీ



**టీ.మీడియా,ఆగస్టు17 రాజమహేంద్రవరం ప్రతినిధి :**
పోలవరం నిర్వాసితుల పోరాటానికి సిపిఎం సంపూర్ణ మద్దతు తెలుపుతుందని, ఈ సమస్యలను జాతీయ స్థాయిలోకి తీసుకెళ్లనున్నామని సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఎం ఏ బేబీ అన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో పోలవరం ముంపు ప్రాంతాల్లో చేపట్టిన రెండు రోజులు పాదయాత్ర ఆదివారం సాయంత్రంతో ముగిసింది. ఈ సందర్భంగా వి ఆర్ పురం మండలం రామవరంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు స్థానిక నాయకులు పులి బుజ్జి అధ్యక్షత వహించారు. స్థానిక మహిళలంతా సిపిఎం బృందాన్ని హారతులతో స్వాగతించారు. పూలమాలతో ఆహ్వానించారు.

**సమస్యలను ఎందుకు పరిష్కరించడం లేదు : ఎం.ఎ.బేబీ**

ఎంఏ బేబీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు వేల కోట్ల రూపాయలతో రాజధానిని నిర్మించేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నారని, అలాంటి ప్రయత్నాలకు తాము వ్యతిరేకం కాదని చెప్పారు. అయితే పోలవరం నిర్వాసితుల సమస్యలను ఎందుకు పరిష్కరించడం లేదు ? అని ప్రశ్నించారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని తెలుగుదేశం, గత వైసిపి ప్రభుత్వం మూడు ప్రభుత్వాలు నిర్వాసితులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యాయన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పోలవరం నిర్వాసితులకు గౌరవప్రదమైన జీవితం కల్పించేందుకు, మెరుగైన మౌలిక వసతులతో కూడిన కాలనీలను నిర్మించాల్సిన బాధ్యత పాలక ప్రభుత్వాలపై ఉందన్నారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి పూర్తి భిన్నంగా ఉందని అన్నారు. గడిచిన రెండు రోజులు పర్యటనలలో పలు కాలనీలను సందర్శించి పోలవరం నిర్వాసితులతో మాట్లాడామని ఎక్కడ చూసినా నాసిరకం నిర్మాణాలే దర్శనమిచ్చాయన్నారు. నిర్మాణాలు పూర్తి చేసి మూడు నాలుగు ఏళ్ళు గడవక






ముందే స్లాబులు నుంచి వర్షం నీరు కారడంతో బరకాలు కట్టుకుని ప్రజలు కాపురాలు ఉంటున్నారని తెలిపారు. అలాంటి ఇండ్లు గుడిసెలను తలపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ ప్రాజెక్టు పోలవరం నిర్మాణానికి రూ.55 వేల కోట్లతో డిపిఆర్ రూపొందించగా కేంద్ర ప్రభుత్వం కేవలం రూ.2200 కోట్లు మాత్రమే విడుదల చేసిందని, ఆ విడుదల చేసిన నిధులలో గత, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వాలు పునరావాసానికి కేవలం రూ.7000 కోట్లు మాత్రమే ఖర్చు చేశాయన్నారు. ఈ ఖర్చు చేసే నిధులలోను అత్యధిక భాగం రాజకీయ పెద్దలు, అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కయ్యి లూటీ చేసినట్లు స్పష్టమవుతుందని చెప్పారు. తక్షణమే దీనిపై విచారణ జరిపి అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు నైపుణ్య శిక్షణ కల్పించి ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు కనీసం ఉపాధి పనులనైనా అన్ని గ్రామాల్లోనూ కల్పించాలని కోరారు. అదేవిధంగా పోలవరం, ఇతర పనులలో నిర్వాసితుల కుటుంబాలకి ఉద్యోగం కల్పించాలని కోరారు. పోలవరం ప్రాజెక్టుకి భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు ఎకరాకు రూ.20 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కమిటీ ఇప్పటికే పోలవరం నిర్వాసితుల సమస్యలను గుర్తించి పోరాటాలను నిర్వహిస్తుందని, రాబోయే రోజుల్లో ఈ ఉద్యమం మరింత తీవ్రతరం చేయాలని ఎం.ఎ.బేబీ సూచించారు.

**సిపిఎం అనుమతించదు.. పోరాడుతుంది : జాన్ బ్రిట్టాస్**

అనంతరం రాజ్యసభ సభ్యులు ఫ్లోర్ లీడర్ జాన్ బ్రిట్టాస్ మాట్లాడుతూ %ా%. పోలవరం నిర్వాసిత కాలనీలను సందర్శించి నిర్ఘాంత పోయానన్నారు. కనీస మౌలిక వసతులు కూడా ఇక్కడి ప్రజలకు కల్పించలేదని వివరించారు. పోలవరం నిర్వాసితుల సమస్య తీవ్రస్థాయిలో ఉన్నప్పటికీ ఆంధ్రప్రదేశ్ నుంచి సారథ్యం వహిస్తున్న తెలుగుదేశం, వైసిపి ఎంపీలు, రాజ్యసభ సభ్యులు పార్లమెంటులో ఎందుకు ప్రశ్నించడం లేదంటూ నిలదీశారు. కేరళలో నిర్మించిన పునరావాస కాలనీలలో విద్యా వైద్యం రవాణా సౌకర్యాలతోపాటు కాలనీలో నివసించే ప్రజలకు ఉపాధి అవకాశాలను కల్పించామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి, నీళ్లు నిలిపి పోలవరం నిర్వాసితులను అనివార్యంగా వెళ్లగొట్టేందుకు చేస్తున్న కుట్ర పొమ్మనకుండా పొగబెట్టిన చందంగా ఉందని మండిపడ్డారు. ఇలాంటి కుట్రలను సిపిఎం అనుమతించబోదని హెచ్చరించారు. పోలవరం నిర్వాసితుల పక్షాన సిపిఎం పోరాడుతుందని తెలిపారు.

**నిర్లక్ష్యాన్ని ఎండగట్టేందుకు సిద్ధంకండి : లోకనాథం**

అనంతరం కేంద్ర కమిటీ సభ్యులు కే లోకనాథం మాట్లాడుతూ %ా%. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి పోలవరం రెండు కళ్ళంటూ చేస్తున్న ప్రకటనలను గుర్తు చేశారు. అయితే పోలవరం అంటే ప్రాజెక్టు మాత్రమే కాదని, ఆ ప్రాజెక్టు కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు పునరావాసం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందన్నారు. వి ఆర్ పురం మండలం రామవరంలో అధికార యంత్రాంగం వేసిన కాంటూరు కాకి లెక్కలకు ఒక ఉదాహరణగా చెప్పొచ్చు అన్నారు. ఈ గ్రామంలో 279 ఇండ్లు ఉంటే రోడ్డుకు ఒకవైపు ఉన్న 166 ఇండ్లకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చారని, రోడ్డుకు మరోవైపు ముంపు ఉండదా ? అని ప్రశ్నించారు. పాలకుల నిర్లక్ష్యం ఫలితంగా పునరావాస కాలనీలో నిర్వాసితులు జీవచ్ఛవాల్లా జీవిస్తున్నారని అన్నారు. పాలకుల నిర్లక్ష్యాన్ని ఎండగట్టేందుకు నిర్వాసితులంతా పోరాటానికి కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. రంపచోడవరం జిల్లా సిపిఎం కార్యదర్శి బొప్పెన కిరణ్ మాట్లాడుతూ %ా% పోలవరం నిర్వాసితుల సమస్యలను సిపిఎం జాతీయ సమస్యలుగా గుర్తించిందని, రాబోయే రోజులలో నిర్వహించే పోరాటాలలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం వాణిశ్రీ మాట్లాడారు. అనంతరం స్థానిక ప్రజలు తమ సమస్యలను ప్రస్తావిస్తూ వినతిపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తులసీదాసు, బలరాం, తదితరులు పాల్గొన్నారు.

---

### గవర్నర్‌వి ప్రతిపక్షాల కంటే
## చౌకబారు రాజకీయాలు
### తమిళనాడు సిఎం స్టాలిన్

**టీ మీడియా, ఆగస్టు 17 ,చెన్నై :**
గవర్నర్ ఆర్.ఎన్.రవి ప్రతిపక్షం కంటే చవకబారు రాజకీయాలకు పాల్పడుతున్నారని తమిళనాడు సిఎం స్టాలిన్ మండిపడ్డారు. ఆదివారం ధర్మపురిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పిఎసిఎస్) కింద తక్షణ పంట రుణ పథకాన్ని ప్రారంభించారు. ఐదుగురు లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈపథకం కింద రుణం కోసం ఆన్‌లైన్‌లో పంపిన దరఖాస్తులను ప్రాసెస్ చేసి, అదే రోజు రైతుల ఖాతాల్లో రుణమొత్తాలను జమ చేస్తామని అన్నారు. 2026 ఎన్నికల కోసం ద్రవిడ మోడల్ 2.0ను ప్రవేశపెట్టినట్లు ప్రకటించారు. రాష్ట్రాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లేందుకు ఈ నమూనాను ప్రారంభించామని, మరోసారి తమిళనాడులో ద్రవిడ నమూనా ప్రభుత్వమే వస్తుందని స్పష్టం చేశారు.బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన గణాంకాలతో గవర్నర్ తన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో తమిళనాడుపై పలు ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఆ ఆరోపణలను స్టాలిన్ ఖండించారు. ఇక్కడ ప్రవేశపెట్టిన వివిధ పథకాలతో తమిళనాడు ప్రస్తుతం ట్రెండ్ సెట్టర్‌గా నిలిచిందని, ఇతర రాష్ట్రాలు

4లో..

### మూడురోజులు తెలంగాణలో...
## అతిభారీ వర్షాలు
### రెడ్ అలెర్ట్ జారీ చేసిన వాతావరణశాఖ

**టి మీడియా, ఆగస్టు 17, హైదరాబాద్ బ్యూరో :**
తెలంగాణలో గతవారం రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వర్షాలకు వరదలు పోటెత్తాయి. ఇప్పటికే వర్షాలకు పలు జిల్లాలు అతలాకుతలమయ్యాయి. ఈ క్రమంలో వాతావరణశాఖ కీలక హెచ్చరికలు చేసింది. రాగల మూడురోజులు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. కొన్ని జిల్లాలకు రెడ్ అలెర్ట్, మరికొన్ని జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఆదివారం కొత్తగూడెం, హన్మకొండ, మహబూబాబాద్, ములుగు, వరంగల్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.ఈ నేపథ్యంలో ఆయా జిల్లాలకు రెడ్ అలెర్ట్ చేసింది వాతావరణశాఖ. ఆదిలాబాద్, జనగాం, భూపాలపల్లి, ఖమ్మం, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, సిద్దిపేట, సూర్యాపేట జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. జగిత్యాల, కామారెడ్డి, కరీంనగర్, మెదక్, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల,

4లో..

### భారత్‌కు చేరుకున్న
## శుభాంశు శుక్లా
### కేంద్రమంత్రి, సీఎం ఘనస్వాగతం

**టి మీడియా, ఆగస్టు 17,ఢిల్లీ బ్యూరో :**
శుభాంశు శుక్లా స్వదేశానికి చేరుకోవడం భారత్?కు గర్వకారణమైన క్షణంగా కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ అభివర్ణించారు. “భారతదేశానికి గర్వకారణమైన క్షణం! ఇస్రోకు కీర్తినిచ్చే క్షణం! ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దీనికి దోహదపడిన వ్యవస్థకు కృతజ్ఞత తెలుపుతూ, దేశ అంతరిక్ష వైభవం భారత గడ్డను తాకింది. భారతమాత దిగ్గజ పుత్రుడు శుభాంశు శుక్లా ఈరోజు తెల్లవారుజామున దిల్లీలో అడుగుపెట్టారు. ఆయనతో పాటు మిషన్ గగన్‌యాన్‌కు ఎంపికైన వ్యోమగాముల్లో ఒకరైన గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్ కూడా ఉన్నారు” అని తెలిపారు. యాక్సియం-4 మిషన్ విజయవంతం తర్వాత తొలిసారి భారత్‌కు వస్తున్నానంటూ శుక్లా శనివారం పోస్టు ద్వారా తెలిపారు. స్వదేశానికి తిరిగి వచ్చేందుకు విమానంలో కూర్చున్నప్పుడు భావోద్వేగానికి గురైనట్లు చెప్పారు. మిషన్ కోసం గతేడాది నుంచి తన స్నేహితులు, కుటుంబసభ్యులకు దూరంగా ఉన్నట్లు వెల్లడించారు. ఇది తనను ఎంతో బాధించిందని పేర్కొన్నారు. వారిని కలిసి తన అనుభవాలను పంచుకునేందుకు ఎంతో ఉత్సాహంగా

3లో..

### కొన్ని పార్టీలు
## తప్పుడు ప్రచారాలు
### నిరాధార ఆరోపణలకు ఈసీ భయపడదు
### సీఈసీ జ్ఞానేశ్ కుమార్

**టి మీడియా, ఆగస్టు 17,ఢిల్లీ బ్యూరో :**
బిహార్ ఓటర్ల జాబితాలోని లోపాలను తొలగించడమే లక్ష్యంగా ‘ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ’ (ఎస్ఐఆర్) చేపట్టామని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అన్నారు. అయితే కొన్ని పార్టీలు దాని గురించి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నాయని, ఇది తీవ్ర ఆందోళనకరమైన విషయమని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి బిహార్‌లో ఓటు చోరీకి వ్యతిరేకంగా ‘ఓటర్ అధికార్ యాత్ర’ చేపట్టిన నేపథ్యంలో సీఈసీ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

**ఆ ఆరోపణలు నిరాధారం**

విలేకరుల సమావేశంలో మాట్లాడిన సీఈసీ జ్ఞానేశ్ కుమార్, డబుల్ ఓటింగ్, ఓటు చోరీ ఆరోపణలు నిరాధారమైనవి అన్నారు. ఎస్ఐఆర్‌ను అత్యంత పారదర్శకంగా చేయడానికి తమ అధికారులు చాలా కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా కాంగ్రెస్?

3లో..

---

# బీహార్‌లో ఓట్లు ‘చోరీ’ కానివ్వం

- బీజేపీ, ఈసీ ఉమ్మడి కుట్ర
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ

**టి మీడియా, ఆగస్టు 17,ఢిల్లీ బ్యూరో :**
బీజేపీతో కుమ్మక్కై ఓట్లను భారత ఎన్నికల సంఘం (ఈసీ) దొంగిలిస్తోందని యావత్ దేశానికి ఇప్పుడు తెలుసని లోక్‌సభ విపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఈ కుట్రలో వాళ్లను ఇండియా కూటమి నెగ్గనివ్వదని ఆయన స్పష్టం చేశారు. ‘ఓటరు జాబితా సమగ్ర సవరణ’ ద్వారా ఓటరు జాబితాల్లోకి ఓటర్లను కలిపి, తీసివేసి బిహార్ అసెంబ్లీ ఎన్నికలనూ తస్కరించాలని ఈసీ, బీజేపీ కుట్ర పన్నాయని ఆయన వ్యాఖ్యానించారు. బిహార్‌లోని 20 జిల్లాల్లో 1,300 కి.మీ పరిధిలో ఆయన ‘ఓటర్ అధికార్ యాత్ర’ను చేయనున్నారు. ఆదివారం ఈ యాత్ర ప్రారంభోత్సవం సందర్భంగా బిహార్‌లోని ససారంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్రనేత ప్రసంగించారు.బిహార్‌లో ఓట్ల చోరీకి పాల్పడేందుకు వాళ్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశాన్ని ఇవ్వబోమని రాహుల్ గాంధీ అన్నారు. పేదల చేతిలో ఉన్న ఏకైక శక్తి ఓటుహక్కు మాత్రమేనని, దాన్ని పేదలకు దూరం కాకుండా చూస్తామని ప్రకటించారు. భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేందుకు ఆర్ఎస్ఎస్, బీజేపీ యత్నిస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకే ‘ఓటర్ అధికార్ యాత్ర’ను ప్రారంభించామని వెల్లడించారు. యావత్ దేశంలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఓట్ల చోరీ జరిగిందన్నారు.



**నిజమైన కులగణనను మోదీ చేయించరు**

‘ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిజమైన కులగణనను చేయించరని నాకు తెలుసు. ఇండియా కూటమి మాత్రమే సిసలైన కులగణనను చేయించగలదు. ఓట్ల చోరీకి మేం అడ్డుకట్ట వేస్తాం. ఓటర్ల జాబితా సమగ్ర సవరణతో ముడిపడిన నిజాలను బయటికి తెస్తాం. నేను మనసారా లాలూజీకి ధన్యవాదాలు చెబుతున్నాను. ఇంటి బయటికి వెళ్లొద్దని డాక్టర్ చెప్పినా వినకుండా నా కోసం ఇక్కడికి లాలూజీ వచ్చారు’ అని రాహుల్ గాంధీ తెలిపారు.

**బీజేపీని తప్పించకుంటే ఓట్లు, హక్కులు, రాజ్యాంగంకు ముప్పు : ఖర్గే**

దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వాళ్లంతా మనకు ఓటుహక్కును ప్రసాదించారని, ఈ హక్కును సవాల్ చేసేలా ఎర్రకోటలో ప్రధాని మోదీ ప్రసంగించారని కాంగ్రెస్ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. భారతదేశ స్వాతంత్ర్యానికి వ్యతిరేకంగా ఆర్ఎస్ఎస్ పనిచేసిందన్నారు. మహాత్మాగాంధీ హత్యకు ఆర్ఎస్ఎస్ ప్రధాన కారణమని ఆరోపించారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో ఎంతమంది ఆర్ఎస్ఎస్ నేతలు జైలుకు వెళ్లారో చెప్పాలని మోదీని ఖర్గే ప్రశ్నించారు. కనీస అర్హత లేని వాళ్ల పేర్లను ఎర్రకోట వేదికగా ప్రధాని మోదీ ప్రస్తావించడం తప్పు అన్నారు. ప్రధాని మోదీ చాలా ప్రమాదకారి అని, ఆయన్ను అధికారం నుంచి తప్పించకుంటే ఓట్లు, హక్కులు, స్వేచ్ఛ, రాజ్యాంగం అన్నీ ప్రమాదంలో పడతాయని ఖర్గే వ్యాఖ్యానించారు. ఆర్ఎస్ఎస్‌కు బ్రిటీష్ వాళ్లతో కలిసి పనిచేసిన చరిత్ర ఉందన్నారు. బీజేపీ వాళ్లు ఓట్ల చోరీకి యత్నిస్తున్నారని, మోదీ సర్కారుకు ఏజెంటులా ఈసీ పనిచేస్తోందని ఆయన ధ్వజమెత్తారు. వచ్చే బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమికి ప్రజలు తగిన శాస్తి చేస్తారన్నారు.

**ఎన్‌డీఏను ఇండియా ఓడించబోతోంది : లాలూ**

‘బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమిని ఇండియా కూటమి ఓడించబోతోంది. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ఎన్‌డీఏ కూటమిని ఓడించక తప్పదు. ఎమర్జెన్సీ కాలం కంటే దారుణమైన పరిస్థితులు ఇప్పుడు మన దేశంలో ఉన్నాయి. ఇలాంటి సమయంలో రాహుల్ గాంధీ మాతో ఉండటం చాలా మంచి విషయం. ఆయన యాత్రతో ప్రజలకు ఇండియా కూటమి మరింత చేరువ అవుతుంది’ అని ఈసందర్భంగా ఆర్‌జేడీ చీఫ్ లాలూప్రసాద్ యాదవ్ తెలిపారు.

**ఓట్ల చోరీకి ఈసీని బీజేపీ వాడుకుంటోంది : తేజస్వి**

‘ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అనేది ఓట్ల లూటీ తప్ప మరొకటి కాదు. ప్రజల ఓట్లను చోరీ చేసేందుకు ఈసీ యత్నిస్తోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ దాన్ని జరగనివ్వం. బీఆర్ అంబేద్కర్ మనకు ఓటు హక్కును ఇచ్చారు. కానీ ఈసీ ద్వారా దాన్ని ప్రజల నుంచి తస్కరించేందుకు బీజేపీ ప్లాన్ వేసింది. బీజేపీ చెప్పినట్టుగానే ఈసీ పనిచేస్తోంది. బిహార్ రాష్ట్ర ప్రజలను దగా చేసే అవకాశాన్ని మోదీజీకి ఇవ్వం. ఓట్లను చోరీ చేసి మళ్లీ అధికారాన్ని దక్కించుకునే స్కెచ్‌ను ఈసీ, బీజేపీ అమలు చేస్తున్నాయి’ అని ఈ కార్యక్రమంలో ఆర్‌జేడీ అగ్రనేత తేజస్వి యాదవ్ వ్యాఖ్యానించారు.

**ఇది కేవలం రాజకీయ యాత్ర కాదు**

కాంగ్రెస్ ‘భారత్ జోడో యాత్ర, భారత్ జోడో న్యాయ్ యాత్రలను విజయవంతం చేసిన తర్వాత ఇప్పుడు ఓటర్ అధికార్ యాత్రను రాహుల్ గాంధీ నిర్వహిస్తున్నారు. దీనికి ఇండియా కూటమి పార్టీల మద్దతు ఉంది. బిహార్‌లో లక్షలాది మంది ప్రజల ఓట్లను చోరీ చేసేందుకు బీజేపీ కుట్ర పన్నిన విషయాన్ని ప్రజలకు తెలియజేసేందుక్నే ఈ యాత్రను రాహుల్ మొదలుపెట్టారు. ఇది కేవలం రాజకీయ యాత్ర కాదు. భారత రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామిక సంస్థల పునరుద్ధరణ, ప్రతీ భారతీయుడి ఓటును కాపాడటం అనే లక్ష్యాలతో ఈ యాత్ర జరుగుతుంది. ఒక వ్యక్తి ఒక ఓటు భావనను పరిరక్షిస్తాం’ అని పేర్కొంటూ కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా ఒక పోస్ట్ చేశారు.

# పోలీస్ శాఖలో రాజకీయ నాయకుడి దందాలు

- షాడో నేతను ప్రసన్నం చేసుకుంటేనే..
- సిండికేట్ నడుపుతున్న ముగ్గురు డీసీపీలు



**టి మీడియా, ఆగస్టు 17, హైదరాబాద్ బ్యూరో :**


తెలంగాణ పోలీస్? శాఖలో ఓ షాడో నేత వ్యవహారం కలకలం రేపుతోంది. ప్రభుత్వంలో తనకు పలుకుబడి ఉందని ప్రచారం చేసుకుంటూ తనను ప్రసన్నం చేసుకుంటే చాలు ఫోకల్ పోస్టింగ్ దక్కుతుందనే భ్రమతో పలువురు అంటకాగుతుండటం శాఖలో చర్చనీయాంశమైంది. ఇందులో పలువురు ఏసీపీలు మొదలుకొని ఉన్నతాధికారుల వరకు ఉన్నారు. పలువురు డీసీపీలు అతడితో కలిసి దందాల్లో మునిగి తేలుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గవర్న్?మెంట్?కు చెందిన ఓ సొసైటీ అధ్యక్షుడి హోదాలో ఉన్న ఆ షాడో నేతతో అంటకాగుతున్న కొందరు పోలీస్ అధికారుల గురించి నిఘావర్గాలు ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఈ జాబితాలో కొందరు ఐపీఎస్ అధికారులు ఉండటం విస్తుగొలుపుతోంది. అక్రమార్జన పెట్టుబడిగా : కీలక కమిషనరేట్ల పరిధిలో పని చేస్తున్న ముగ్గురు డీసీపీలు సిండికేట్‌గా ఏర్పడి దందా సాగిస్తుండటం పోలీస్ శాఖలో కలకలం రేపుతోంది. వీరు నార్సింగి ప్రాంతంలో తరచూ కలుస్తూ సెటిల్‌మెంట్ల గురించి చర్చించుకోవడంతో పాటు తమ అక్రమార్జనను స్థిరాస్తి వ్యాపారంలో పెట్టుబడులుగా పెడుతున్నారనేది శాఖలో బహిరంగ రహస్యంగా మారింది. అయినప్పటికీ వీరిపై చర్యల్లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. తనిఖీలు చేయగా వ్యవహారం బయటకు : వ్యవస్థీకృత నేరాల నియంత్రణ కోసం కీలక కమిషనరేట్‌లో ఓ జోన్‌ను పర్యవేక్షించిన ఓ డీసీపీ పెద్దఎత్తున అక్రమార్జనకు పాల్పడ్డాడని, తన పరిధి కానప్పటికీ గతంలో తాను పనిచేసిన జోన్‌లో షాడో నేత అండతో తలదూర్చి అసాంఘిక కార్యకలాపాలకు అండగా నిలిచాడని ఆరోపణలున్నాయి. శాంతిభద్రతల విభాగం డీసీపీ పేరు చెప్పి పలు పబ్‌లలో డబ్బులు వసూలు చేశాడు. అత్యంత ఖరీదైన ఓ గేటెడ్ కమ్యూనిటీలో శని, ఆదివారాల్లో పేకాట శిబిరం నడిపించేందుకు నెలకు రూ.20 లక్షల వరకు వసూలు చేశాడు. స్పాలలోకి నేరుగా వెళ్లి నెలవారీ మామూళ్లు తీసుకున్నాడు. కొద్దిరోజుల క్రితం మహిళా భద్రత విభాగం అధికారులు స్పాలలో తనిఖీలు చేపట్టగా అతడి దందా వెలుగులోకి వచ్చింది. షాడో నేత సపోర్ట్? ఉన్నంతవరకు తనకేమీ కాదని పలుమార్లు బహిరంగంగానే చెప్పిన ఈ డీసీపీ వ్యవహారం శ్రుతిమించడంతో ఉన్నతాధికారులు విచారణ జరిపి ఇటీవలే వేటు వేశారు. రాష్ట్రంలోనే కీలక జోన్‌లో పనిచేస్తున్న అదనపు డీసీపీ గతంలో అవినీతిపై దర్యాప్తు చేసే విభాగంలో పనిచేశాడు. అందరి జాతకాలు తన వద్ద ఉన్నాయని, తనను ప్రసన్నం చేసుకోకపోతే పనిపడతానంటూ తన పరిధిలోని పోలీసులను అతడు బెదిరిస్తున్నట్లు తెలుస్తోంది. సెట్ కాన్ఫరెన్స్‌లోనే షాడో నేతను ఏకంగా 'భాయ్'గా సంబోధిస్తూ అతడి కోసం పనిచేయాలని క్షేత్రస్థాయి పోలీసులకు సూచించినట్లు సమాచారం. దీన్ని తప్పుపట్టిన డీసీపీకి షాడో నేతతో ఫోన్ చేయించడం పోలీస్ శాఖలో చర్చనీయాంశంగా మారింది. మరో కీలకమైన కమిషనరేట్‌లో వ్యవస్థీకృత నేరాల్ని పర్యవేక్షించే విభాగంలో పనిచేస్తున్న మరో డీసీపీ సైతం షాడో నేతతో కలిసి సెటిల్‌మెంట్లు చేస్తుండటంపై నిఘా విభాగం దర్యాప్తు ఆరంభించింది.

**ఒకే అంశంపై ఫిర్యాదులు**

ప్రభుత్వంలోని కీలక పెద్దలతో షాడో నేత అంటకాగుతుండటం రాజకీయ వర్గాల్లోనూ విస్మయం కలిగిస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా పనిచేసిన ఉత్తరాంధ్రకు చెందిన ఓ కీలక నేతతో సన్నిహితంగా మెలిగిన షాడో నేత రాష్ట్ర విభజన అనంతరం గత ప్రభుత్వంలోని ఓ కీలక నాయకురాలికి దగ్గరగా ఉన్నాడు. తనను కలవాలనుకునే పోలీస్ అధికారులకు అతడు అపాయింట్‌మెంట్లు సైతం ఇస్తున్నాడు అంటే అర్థం చేసుకోవచ్చు. అతడు జిమ్‌లో ఉన్న సమయంలో అనుచరులు పోలీసులకు ఫోన్ చేసి 'భాయ్‌ను వచ్చి కలవాల'ని చెబుతున్నారు. ఇటీవల ఓ అంశంపై వివాదం నేపథ్యంలో తనపై అభాండాలు వేశారంటూ తన అనుచరుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఫిర్యాదు చేయించారు. ఒకే అంశంపై పలు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయించడం గమనార్హం. ఓ డీసీపీ భూవివాదాల్లో తలదూర్చుతూ అక్రమార్జనకు పాల్పడుతున్నాడు. తన జోన్ పరిధిలోని భూవివాదాలను సెటిల్ చేసే బాధ్యతను అతడి కుటుంబ సభ్యులు పర్యవేక్షిస్తున్నారు. తన సెటిల్‌మెంట్ల వ్యవహారాలను బహిర్గతం చేస్తున్నారంటూ తన కార్యాలయంలోని సిబ్బందిని మార్చేయడం చర్చలకు దారితీసింది. ఇంకో డీసీపీ సైతం భూవివాదాల్నే లక్ష్యంగా చేసుకొని దందాలు సాగిస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం తన భూమి పొసెషన్ కోసం సహకరించాలని ఓ వ్యక్తి కోరగా ఎకరాకు రూ.50 లక్షల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో అతడు కిమ్మనకుండా వెనుదిరిగాడు. ఒక వెంచర్‌కు రాకపోకలు సాగించే మార్గం లేకపోవడంతో షాడో నేతతో కలిసి ఓ డీసీపీ ఇటీవల స్వయంగా రంగంలోకి దిగి ఇరువర్గాలకు రాజీ కుదిర్చాడు. ఇందుకుగాను 2 ప్లాట్లను తన కుటుంబ సభ్యుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. షాడో నేత అండతో భూవివాదాలకు సంబంధించిన కేసుల్ని డీల్ చేస్తూ వాటాలు డిమాండ్ చేస్తున్నాడు. ఓ బాధితుడు ఇటీవల డీసీపీని కలిసి తనకు చెందిన 500 గజాల స్థలంపై కబ్జారాయుళ్లు కన్నేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై డాక్యుమెంట్లు సరిగ్గా ఉంటే రూ.30 లక్షలు సరిగ్గా లేకుంటే రూ.50 లక్షలు ఇవ్వాలని డీసీపీ నేరుగానే అడిగినట్టు ప్రచారం జరిగింది.

## పట్టు వస్త్రాలు కానుకగ..ఆశీస్సులు ఆప్యాయతగా

**టి మీడియా, ఆగస్టు 17,ఖమ్మం :**



జిల్లాలో ఆదివారం పండుగ వాతావరణం తలపించింది. తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వరుస శుభకార్యాల్లో పాల్గొని ప్రజలతో ఆత్మీయంగా మమేకమయ్యారు. కూసుమంచి మండలం నాయకన్ గూడెం గ్రామంలో ఆదిత్య ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభోత్సవం, గంగమ్మతల్లి ఆలయంలో బోనాల జాతరలో పాల్గొని భక్తులతో కలిసిపోయారు. అనంతరం మల్లేపల్లిలోని బీఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో పురం ఉపేందర్ కుమారుని వివాహం, నేలకొండపల్లి ఏఎంసీ మార్కెట్ యార్డులో చిలకల రాములు కుమారుని వివాహం, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో వరుసగా జరిగిన పెళ్లిళ్లు, నిశ్చితార్థాలు, రిసెప్షన్లకు హాజరై ఆశీర్వచనాలు అందించారు. వెంకటగిరిక్రాస్ రోడ్‌లోని శ్రీహర్ష కన్వెన్షన్, నాయుడుపేట పీవీఆర్ గార్డెన్స్, రెడ్డిపల్లి ఏఆర్ గార్డెన్స్, సత్యనారాయణ పురం టీసీవీ రెడ్డి ఫంక్షన్ హాల్‌లలో జరిగిన వివాహ వేడుకల్లో పట్టు వస్త్రాలను కానుకగా అందజేశారుఖమ్మం నగరంలోని రామన్నపేట, ఉషాహరి కన్వెన్షన్, సిటీ సెంట్రల్ కన్వెన్షన్, ఎస్ఆర్ కన్వెన్షన్, పుట్టకోటతో పాటు అనేక ప్రాంతాల్లో జరిగిన శుభకార్యాల్లోనూ పాల్గొన్నారు. శ్రీనగర్ కాలనీలో శెట్టిపల్లి వెంకటేశ్వర్లు మనమరాళ్ల ఓణీల అలంకరణ వేడుకలోనూ మమేకమయ్యారు. ప్రతీ చోటా పట్టు వస్త్రాలను కానుకగా అందజేస్తూ... ఆత్మీయత నిండిన ఆశీస్సులను మంత్రి పొంగులేటి వారికి అందించారు.

# పత్తి చేళ్లలో బురద నీరు

**వరి పొలాల్లో ఇసుక మేటలు**

**టి మీడియా, ఆగస్టు 17,నెన్నెల:**



మంచిర్యాల జిల్లా నెన్నెల మండలంలో రెండు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలు రైతులకు కన్నీళ్లు మిగిల్చాయి. వర్షాలకు పత్తి, వరి పంటలు నీటమునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాలు పూర్తిగా వరద నీటిలో తేలియాడుతున్నాయి. వాగు పరివాహక ప్రాంతాల్లో ఉన్న వందలాది ఎకరాల్లాలోని పత్తి చేనులోకి వరద నీరు చేరడంతో పత్తి మొక్కలు పూర్తిగా బురదలో కురుకుపోయాయి. వందలాది ఎకరాలలో బురద చేరడంతో మొక్కలు చనిపోతాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇంకా పలు ఎకరాలలో వరదా నీరు నిలిచే ఉన్నాయి. నెన్నెల, మన్నెగూడెం, గొల్లపల్లి, నందులపల్లి, అవుడం, గంగారం గ్రామాలలో వరి నాట్లు వేసిన పొలాలు పూర్తిగా నీటిలో మునగడం తో వరి నాట్లు కుళ్లిపోతున్నాయని రైతులు తెలిపారు. పలు ఎకరాలలో వరద ఉధృతికి నారు కొట్టుకుపోయింది. ఇసుక మేటలు వేసి చేతికి రాకుండా పోయింది. చేరువులు, కాలువలకు గండ్లు పడటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే నష్ట పోయిన పంటలను పరిశీలించి ఆదుకోవాలని కోరుతున్నారు.

## గంజాయి స్వాధీనం ఇద్దరు అరెస్టు

**టి మీడియా, ఆగస్టు 17,ఊట్కూర్ :**



నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలో గంజాయి విక్రయాలు చాప కింద నీరుల కొనసాగుతున్నాయి. ఈ నెల 15న ఊట్కూర్ మండల కేంద్రంలోని మక్తల్ ప్రధాన రహదారి అయ్యప్ప స్వామి టెంపుల్ సమీపంలో అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు యువకులను టాస్క్ ఫోర్స్ పోలీసులు ( %ఝంఎ ఖీశీతీఛవ% ) అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. యువకుల వద్ద నుంచి 125 గ్రాముల గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకుని ఊట్కూర్ ఎస్సై రమేష్ కు సమాచారం అందించారు.

నిందితులలో ఒకరు ఊట్కూర్ మండలం చెట్టు కింది అరవింద్ ( 22 ) , కర్ణాటక రాష్ట్రం గుర్మిట్కల్ తాలూకా కేంద్రానికి చెందిన కోరేబాన్ సంజీవ్ ( 23) గుర్తించి కేసు నమోదు చేసుకున్న పోలీసులు జిల్లా జైలుకు తరలించారు. నిషేధిత గంజాయి విక్రయాలు చేపడితే చట్టపరమైన శిక్షలు తప్పవని ఎస్సై రమేష్ హెచ్చరించారు. గ్రామాల్లో గంజాయి విక్రయాలు చేపడితే పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని సూచించారు.

**సరిహద్దు శివారులో..**

తెలంగాణ సరిహద్దు శివారులోని గుడిమిట్కల్, యాద్గీర్ పట్టణాల నుంచి శివారు గ్రామాల మీదుగా ఊట్కూర్ మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాలైన పులిమామిడి, చిన్నపొర్ల, పెద్దపొర్ల, మల్లేపల్లి, ఎడవెల్లి, నిడుగుర్తి, పెద్ద జట్రం తదితర గ్రామాలకు గంజాయి సరఫరా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు పట్టణాలకు మాత్రమే పరిమితమైన గంజాయి విక్రయాలు గ్రామీణ ప్రాంతాలకు సైతం విస్తరించడంతో గంజాయి మత్తులో యువత తూలుతున్నారు. దినసరి కూలీలు, కళాశాల విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని గుట్టు చప్పుడు కాకుండా గంజాయి అమ్మకాలను చేపడుతున్నారు. విద్యార్థులు, యువత గంజాయి మత్తుకు బానిస అవుతుండడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గంజాయి సరఫరాను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## రైల్వేస్టేషన్ పునఃప్రారంభం

**టి మీడియా, ఆగస్టు 17,చింతకాని :**



ఖమ్మం జిల్లా చింతకాని మండలంలోని ఖమ్మం-విజయవాడ - ప్రధాన రైలు మార్గంలో చరిత్ర కలిగిన నాగులవంచ రైల్వేస్టేషన్ ను ఇటీవల మసివేశారు. రైల్వేస్టేషన్ మూసివేత వలన ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను ఈ ప్రాంత ప్రజలు రైల్వే ఉన్నత అధికారుల దృష్టికి, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకుకెళ్లారు. ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు శనివారం రైల్వే ఉన్నత అధికారులు రైల్వే స్టేషన్ ఎత్తివేతను నిలిపివేస్తూ జీవో జారీచేశారు. వారి ఆదేశాల మేరకు ఖమ్మం రైల్వే కమర్షియల్ డిపార్టుమెంట్ అధికారి శ్రీనివాసులు ఆదివారం రైల్వేస్టేషన్‌ను పునఃప్రారంభిచారు. ప్రయాణికుల కోసం టికెట్ బుకింగ్ ఏర్పాటు చేశారు. రైల్వే స్టేషన్ టికెట్ బుకింగ్ క్లర్క్‌గా శేష్ కుమారిని నియమించారు. విజయవాడ-భద్రాచలం రోడ్డు, డోర్నకల్-విజయవాడ వెళ్లు ప్రయాణికులకు టికెట్‌లు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తేలుకుంట్ల శ్రీనివాస్, పరిటాల యలమంద, కోపూరి నవీన్, ఆలస్యం బసవయ్య, బొర్రా ప్రసాద్, కొల్లి బాబు, అంబటి శాంతయ్య, వేణు వివిధ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## యూరియా కోసం వర్షాన్ని లెక్కచేయని రైతులు

**టీ మీడియా, అక్టోబర్ 17 ,నర్వ :**



నర్వ మండల కేంద్రం లోని ప్రాథమిక సహకార సంఘం వద్ద యూరియా కోసం వర్షాన్ని లెక్కచేయకుండా పడిగాపులుకాస్తున్న రైతులు. యూరియా కోసం ఆధార్ కార్డులు,పాస్ బుక్కులు క్యూలోపెట్టి అన్నదాతలు పడిగాపులుపడ్డారు. సాయంత్రం వరకుసింగిల్ విండోకార్యాలయం వద్దయూరియాకు రైతులు ఎగబడ్డారు. రైతులు, సిబ్బంది మధ్య చిన్నపాటి తోపులాట చోటుచేసుకుంది. నర్వ సింగిల్‌విండో కార్యాలయం వద్ద ఆదివారం రోజు యూరియా కోసం రైతులు పడిగాపులు కాశారు. సహకార సంఘం లో యూరియా నిల్వ ఉన్నదని సమాచారం తెలుసుకున్న రైతులు ఉదయం 6:00 గంటల నుండే ఒక్కసారిగా రైతులు ఎగబడ్డారు. యూరియా కొరకు కార్యాలయం వద్దకు దూసుకరావడంతో గందరగోళం ఏర్పడింది. పలుకుబడి ఉన్నవారికే యూరియా ను ఇస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నా రని రైతులు సిబ్బంది పై మండిపడ్డారు.

## మార్కెట్ చైర్మన్‌ను సన్మానించిన మంత్రి, ఎమ్మెల్యే

**టీ మీడియా ఆగస్టు 17 కొత్తకోట:**



కొత్తకోట పట్టణంలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా కృష్ణ దేవాలయానికి కి వచ్చిన సందర్భంగా పశుసంవర్ధక శాఖ మాత్యులు వాకిటి శ్రీహరి ఆత్మకూరు మార్కెట్ చైర్మన్ రేహమతుల్లా ను దేవరకద్ర ఎమ్మె జి మధుసూదన్ రెడ్డి తో కలిసి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసినారు. ఇట్టి కార్యక్రమంలో కొత్తకోట కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అబార్షన్ మాత్రలతో వ్యాపారం

- నెలలను బట్టి మార్కెట్‌లో రేటు
- విచ్చలవిడిగా విక్రయం



**టి మీడియా, ఆగస్టు 17,నల్గొండ:**

జిల్లాలోని పలు మెడికల్? షాప్?ల?లో గర్భస్రావం మాత్రలను విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. కొంతమంది ఆర్ఎంపీలు గుట్టుచప్పుడు కాకుండా గర్భస్రావాలు చేస్తున్నారని విశ్వసనీయ సమాచారం. అయితే వీరు డబ్బుకు ఆశపడి ఆ మాత్రలు ఇస్తున్నారు. గర్భిణి నెలలను ఆధారంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. మరి కొందరు తెలివిగా తెలిసిన నర్సింగ్ హోంలకు తీసుకెళ్లి గర్భస్రావాలు చేయిస్తూ అందిన కాడికి దండుకుంటున్నారు. వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు నెలవారీ మామూళ్లతో సరిపెట్టుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలాంటి నర్సింగ్ హోంలు జిల్లాలో వందకుపైగానే ఉన్నట్లు అంచనా.

**చట్టాలంటే భయమేదీ?**

లింగ నిర్ధారణ, గర్భస్రావాలు చేయడం చట్ట విరుద్ధం. పీసీ పీఎన్‌డీటీ (ప్రీ కన్సెప్షన్ అండ్ ప్రీనాటల్ డయాగ్నస్టిక్ టెక్నిక్స్ చట్టం-1994) ప్రకారం లింగ నిర్ధారణ శిక్షార్హమైనది. ఎంటీపీ (మెడిక్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ చట్టం-1971) ప్రకారం గర్భస్థ శిశువు కారణంగా గర్భిణికి ప్రాణాపాయం ఏర్పడినప్పుడు లేదా కడుపులో శిశువు మృతిచెంది ఉన్నట్లు స్కానింగ్ ద్వారా తెలిసినప్పుడు మాత్రమే అర్హులైన వైద్యుల సమక్షంలోనే గర్భస్రావం చేయాల్సి ఉంది. కానీ ప్రస్తుతం జిల్లాలో ఇవేవీ అమలు కావడం లేదు. మెడికల్? షాపులో లభించే మాత్రలు, ఇంజెక్షన్ల సాయంతో సులభంగా ఆడ పిల్లలను చంపేస్తున్నారు.


**అధికారులు చూసీచూడనట్లు**

నల్గొండ జిల్లాలో ఇలాంటి ఘటనలు వెలుగు చూస్తున్న సమయాల్లో సంబంధిత అధికారులు ఆచి'తూచి' వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సంవత్సరం మే 24న ఓ ఆసుపత్రిలో మోతె మండలానికి చెందిన అనుష అనే మహిళకు నకిలీ వైద్యులు అబార్షన్ చేస్తుండగా వికటించి మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటివరకు నిందితులందరినీ అరెస్టు చేయకపోదం విశేషం. రెండు నెలలు గడిచినా నిందితులను పోలీసులు పట్టుకోలేకపోవడానికి గల కారణాలు తెలియడం లేదు. మరోవైపు ఇటీవల జిల్లా కేంద్రంలో ఇద్దరు ప్రైవేటు వ్యక్తులు చర్చి కంపౌండ్ ప్రాంతంలో లింగ నిర్ధారణ దుకాణాలను తెరిచారు. అతి కష్టంపై ఇద్దరినీ పట్టుకున్న పోలీసులు స్టేషన్ బెయిల్ మంజూరు చేసి ఇంటికి పంపించారు. అక్రమాలకు పాల్పడినప్పుడు కఠిన చర్యలు తీసుకోకపోవడంతో వారు తిరిగి అదే వృత్తిని అలవాటుగా ఎంచుకుంటున్నారు. అదే విధంగా అక్రమాలకు పాల్పడే వారిపై పోలీసులు పీడీ యాక్ట్ లాంటి కఠినమైన చట్టాలు ప్రయోగిస్తేనే వీటికి అడ్డుకట్ట పడే అవకాశాలు ఉంటాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## విలీన మండలాల వారికి నిరాశే

- వర్తించని ఆర్టీసీ స్త్రీ శక్తి' పథకం

**టి మీడియా, ఆగస్టు 17,చింతూరు :**




ఏపీలో కూటమి ప్రభుత్వం మహిళల కోసం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన 'స్త్రీ శక్తి' పథకం అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని విలీన మండలాల్లో అమలు కావడం లేదు. ప్రధానంగా కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక, చింతూరు మండలాలు అంతరాష్ట్ర సరిహద్దుల్లో ఉండటంతోనే ఆయా మండలాల్లోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి రాలేదు.

**నాలుగు మండలాలకు వర్తించని పథకం**

ఈ నాలుగు మండలాలకు వచ్చే ఆర్టీసీ బస్సులు తెలంగాణలోని భద్రాచలం వరకు రాకపోకలు సాగిస్తున్నాయి. వీటిని అంతరాష్ట్ర సర్వీసులుగా ఆర్టీసీ అధికారులు చూపుతున్నారు. ఈ బస్సుల్లో 2 కిలోమీటర్లు ప్రయాణిస్తే భద్రాచలం పట్టణం వస్తుంది. మిగతా ప్రయాణమంతా ఏపీలో సాగుతుంది. అయినప్పటికీ అధికారులు వీటిని అంతరాష్ట్ర సర్వీసులుగా పరిగణించడంతో 4 మండలాల మహిళలకు ఫ్రీ బస్సు పథకం అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. ఆంధ్రప్రదేశ్?లోని చివరి స్టాప్ వరకైనా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని మహిళలు కోరుతున్నారు.




## నా రాజకీయ గురువు కోల్పోవడం బాధాకరం

- సంతాప సభలో ఎమ్మెల్యే

**టి మీడియా, ఆగస్టు 17,పినపాక ప్రతినిధి:**

నా రాజకీయ గురువును కోల్పోవడం బాధాకరంగా ఉందని, భావోద్వేగంతో పినపాక శాసనసభ్యులు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ బొల్లోజు అయోధ్య చారి సంతాప సభ ఆదివారం మణుగూరులోని కిన్నెర కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు, చాడ వెంకటరెడ్డి,వక్తలు మాట్లాడుతూ, గత 50 ఏళ్లుగా మణుగూరు డివిజన్ లో ప్రజా సమస్యలపై అనేక ఉద్యమాలు, పోరాటాలు చేసి ప్రజల గుండెల్లో చిర స్థాయిగా నిలిచిన అయోధ్య మరణం పార్టీకి, ఈ ప్రాంత ప్రజలకు తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, భాగం హేమంతరావు, ఉమ్మడి ఖమ్మం జిల్లా డిసిసిబి డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు, పినపాక నియోజకవర్గం లోని ఏడు మండలాల కార్యదర్శులు, వందలాది మంది పార్టీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## బోనాలు మీకు బోగభాగ్యాలు మాకు

- బోనాలతో బయలుదేరిన మహిళలు

**టి మీడియా, ఆగస్టు 17,పినపాక ప్రతినిధి:**



బోనాలు మీకు సమర్పిస్తాం బోగభాగ్యాలు మాకు కల్పించు తల్లీ అంటూ ముత్యాలమ్మ కు మొక్కులు చెల్లించుకున్నారు అశ్వాపురం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీవాసులు. శ్రావణమాసం సందర్భంగా ఆదివారం ఎస్సీ కాలనీవాసులు గ్రామదేవత ముత్యాలమ్మకు బోనాల వేడుకలు నిర్వహించారు. ఇళ్ల నుంచి మహిళలు బోనాలు ఎత్తుకొని గ్రామ శివారు లోని ముత్యాలమ్మ తల్లి ఆలయం వద్దకు డీజేలు, డప్పుచప్పుళ్లు, ఆటపాటలతో చేరుకున్నారు. దీంతో బోనాల వేడుకలు జాతరను తలపించాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎస్సీ కాలనీ లోని ఇళ్లలో బంధుమిత్రులతో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో గద్దల రామకృష్ణ,సుంచు రామ్మూర్తి భారీ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నాయకుడిని పరామర్శించిన రేగా

**టి మీడియా, ఆగస్టు 17,పినపాక ప్రతినిధి:**



ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి, కుడి కాలికి శస్త్ర చికిత్స చేయించుకొని మొండికుంట లోని తన ఇంటి వద్ద విశ్రాంతి పొందుతున్న బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు జాలె రామకృష్ణారెడ్డిని ఆదివారం పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ శాసనసభ్యుడు రేగా కాంతారావు పరామర్శించారు. రామకృష్ణారెడ్డిని పరామర్శించిన వారిలో భద్రాచలం పార్టీ సీనియర్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, నూనె రామకృష్ణ, అశ్వాపురం మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు ఈదర సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు కోడి అమరేందర్ యాదవ్, మర్రి మల్లారెడ్డి, ప్రవాస భారతీయుడు కందిమళ్ళ సత్యనారాయణ రెడ్డి, తిప్పారెడ్డి విజయభాస్కర్ రెడ్డి తదితరులున్నారు.

## మృతురాలి కుటుంబానికి పెద్దన్న మెగారెడ్డి చేయూత

**టీ మీడియా ,ఆగస్టు 17 ,పెబ్బేరు:**



పెబ్బేరు మండల పరిధిలోని చిన్న గుమ్మడం గ్రామానికి చెందిన గోవిందమ్మ అనారోగ్యంతో శనివారం మరణించారు. ఈ విషయాన్ని చిన్న గుమ్మడం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కృష్ణ వనపర్తి జిల్లా బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్ దృష్టికి తీసుకురాగా వెంటనే వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకుపోగా మేఘన చేయూత సహాయం ద్వారా మృతురాలి కుటుంబానికి రూ,5000 వేల ఆర్థిక సహాయాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణ శ్రీనివాసులు పి శ్రీనివాసులు శ్రీరాములు వెంకటస్వామి గోవింద్ నాగరాజు చేతుల మీదగా అందజేశారు.



### గవర్నర్‌వి ప్రతిపక్షాల కంటే

# చౌకబారు రాజకీయాలు

### తమిళనాడు సిఎం స్టాలిన్

కూడా వాటిని అనుకరిస్తున్నాయని అన్నారు. తన ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న పలు పథకాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. తమ పథకాలకు ప్రతినిధులు లబ్ధిదారులేనని అన్నారు. మహిళలకు ఖర్చులేకుండా బస్సు ప్రయాణం అందించాలనే ఉద్దేశంతో విదియల్ పాయం సర్వీసును ప్రవేశపెట్టానని అన్నారు. అయితే ఈ పథకంతో బస్సు సర్వీసుల సంఖ్య తగ్గుతుందని, బస్సు చార్జీలు పెంచుతారన్న అన్నాడిఎంకె నేతల విమర్శలను తిప్పికొట్టారు. మలిగర్ ఉరిమై తిట్టంతో మహిళలు రూ.50,000 వరకు ఆదా చేసుకునేందుకు వీలు కల్పించిందని అన్నారు.

గవర్నర్ ఆర్.ఎన్.రవి డిఎంకె ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడంతో పాటు ప్రజల్లో భయం, ఆందోళనను పెంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రతిపక్షాలకు మించిన చవకబారు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆ వ్యక్తి గవర్నర్ బంగ్లాలో కూర్చుని ద్రవిడ నమూనాను, ద్రవిడ భాషను ఎగతాళి చేస్తూ, ఉనికిలో లేని తిరుక్కురల్‌ను తయారుచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గవర్నర్ తమిళనాడులోనే ఉండాలని కోరుకుంటున్నానని, మన జీవన విధానంపై ఆయన నిరంతర దాడితో సంస్కృతి, భాష పట్ల మనకున్న ప్రేమ మరింత బలపడుతుందని అన్నారు. తమిళనాడులో మహిళలకు భద్రత లేదని, మహిళలపై నేరాలు పెరుగుతున్నాయని గవర్నర్ కనుగొన్నారని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వ సొంత జాతీయ నేర రికార్డుల డేటా ప్రకారం.. బిజెపి పాలిత ఉత్తరప్రదేశ్ దేశంలో మహిళలపై నేరాల జాబితాలో అగ్రస్థానంలో ఉందని అన్నారు. తాము అధికారంలోకి వచ్చినప్పటి నుండి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులను ఎలా ఆకర్షించామని గవర్నర్‌ను నిలదీశారు.

### ఎరువుల కేటాయింపుల్లో

# కోత

## కేంద్రంపై ఒత్తిడి చేయని కూటమి సర్కార్



**టీ మీడియా,ఆగస్టు 17,అమరావతి :** రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వ ఎరువుల కేటాయింపుల కోతలు కొనసాగుతున్నాయి. కోతలపై కేంద్రంపై ఒత్తిడి చేయకుండా వచ్చిన వాటితో మేనేజ్ చేయాలని టిడిపి కూటమి ప్రభుత్వం వ్యవసాయశాఖ నెత్తిన భారం వేసింది. మేనేజ్ చేసే క్రమంలో వ్యవసాయశాఖ అస్తవ్యస్త విధానాల కారణంగా ఈ ఏడాది ఖరీఫ్ రైతుకు ఆదిలోనే ఎరువుల కొరత ఎదురైంది. అదనుకు యూరియా దొరకని దుస్థితి నెలకొంది. కొన్ని చోట్ల డిఎపి, కాంప్లెక్స్‌లకు సైతం సమస్య తలెత్తింది. జులై, ఆగస్టులోనే పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే సెప్టెంబర్, అక్టోబర్‌లో ఇంకెలా ఉంటుందోనన్న ఆందోళన అన్నదాతలను వెంటాడుతోంది. నిరుడు ఎరువుల అమ్మకాలను ప్రాతిపదికగా చేసుకొని పది శాతం మేర వినియోగాన్ని తగ్గించాలని కేంద్రం ఆదేశించి ఆ మేరకు ప్రస్తుత ఖరీఫ్‌లో కేటాయింపులు తగ్గించింది. యూరియా 2024 ఖరీఫ్‌లో 6.32 లక్షల టన్నుల అమ్మకం జరిగింది. ఈ సంవత్సరం కేంద్రం 6.22 లక్షల టన్నులకు కేటాయింపులు తగ్గించింది. చివరాఖరుకు ఎంత మేర సరఫరా జరుగుతుందో చూడాలి. కొన్నేళ్ల అనుభవంలో మామూలుగా ప్రతి ఏడాదీ ఐదు నుంచి పది శాతం వరకు ఎరువుల వినియోగం పెరుగుతోంది. గతేడాది సేల్స్‌పై సగటున 45 వేల టన్నుల కేటాయింపులు పెరగాలి. కానీ కేటాయింపులు పది వేల టన్నులు తగ్గాయి.

**అంచనాల్లో వైఫల్యం**

అనూహ్యంగా రుతుపవనాలు ఈ సంవత్సరం మే 26న రాష్ట్రంలోకి ప్రవేశించాయి. సీజన్ 25-30 రోజులు ముందే వచ్చింది. రాయలసీమలో ముందస్తు వానలకు పంటలు వేశారు. ముందస్తుగా పంటలు వేసిన చోట ఎప్పటి కంటే ఎరువుల వినియోగం పెరిగింది. ఇక పంటలకు ధరల సమస్య కారణంగా రైతులు ఒక ఏడాది వేసిన పంటలను మరుసటి ఏడాది వేయకుండా మారుస్తున్నారు. రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో మిర్చి స్థానంలో పత్తి, వరి వేశారు. మిర్చికి కాంప్లెక్స్ వేస్తారు. పత్తి, వరికి యూరియా వాడతారు. మిర్చికి బదులు పత్తి, వరి వేసిన చోట్ల యూరియాకు డిమాండ్ వచ్చింది. కొన్ని ప్రాంతాల్లో పంటల సరళిలో వచ్చిన ఈ మార్పులను క్షేత్ర స్థాయిలో వ్యవసాయశాఖ సరైన సమయంలో గుర్తించలేదు. ఈ కారణంగా యూరియాకు తీవ్ర కొరత ఏర్పడింది. నష్టనివారణలో భాగంగా జూన్‌లో రాయలసీమలో, ముఖ్యంగా నంద్యాలకు ఉమ్మడి కృష్ణా, గుంటూరు ఏరియా నుంచి యూరియాను తరలించారు. అలాగే ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల నుంచి కూడా యూరియాను తరలించారు. ఇప్పుడు కృష్ణా, గుంటూరు, గోదావరి జిల్లాల్లో సీజన్ ముమ్మరమై కొరత ముందుకొచ్చింది.

**వాస్తవానికి భిన్నంగా..**

ఎరువుల కొరత లేదని ప్రభుత్వం, వ్యవసాయశాఖ చెబుతుండగా, క్షేత్ర స్థాయిలో వాస్తవం ఆ విధంగా లేదు. జులై నెల యూరియా కేటాయింపు 3.05 లక్షల టన్నులు కాగా, 2.85 లక్షల టన్నులే వచ్చాయి. లోటు 20 వేల టన్నులు. అన్ని జిల్లాలకు కలిపి 20 వేల టన్నుల కోత కనిపిస్తోంది. వ్యవసాయశాఖ డిబిటి ప్రాతిపదికన ఎరువుల నిల్వలను చెబుతోంది. డిబిటి నమోదులు సరిగ్గా చేయనందున రికార్డులకు, వాస్తవానికి మధ్య వ్యత్యాసం వస్తోంది. పిఎసిఎస్‌లకు పంపుతున్న యూరియాపై స్థానిక అధికార పార్టీల నాయకుల ఆధిపత్యం కొనసాగుతోంది. వారి కనుసన్నల్లో ఎరువుల పంపిణీ జరుగుతోంది. పార్టీ అనుయాయులకు ఎరువులను ముందుగా అమ్ముతున్నారు. స్టాక్ ఉండట్లేదు. దాంతో రైతుల్లో నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈ కారణంగా పిఎసిఎస్‌లలో డిబిటి వివరాలు నమోదు చేయడం లేదు. దాంతో నిల్వలు ఉన్నట్లు కంప్యూటర్లలో కనిపిస్తోందంతే. సాధారణ పరిస్థితుల్లో ఆగస్టులో యూరియా 1.65 లక్షల టన్నుల అవసరం ఉంది. ఆగస్టు 13 నాటికి వ్యవసాయశాఖ వెల్లడించిన గణాంకాల ప్రకారం చూసుకుంటే మన్యం, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు, కృష్ణా, కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో కావాల్సినదానికంటే తక్కువ స్టాక్ ఉంది. డిఎపి.. విజయనగరం, మన్యం, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్లలో, కాంప్లెక్స్.. మన్యం, అనకాపల్లి, కర్నూలులో తక్కువ స్టాక్ ఉంది.



### మూడురోజులు తెలంగాణలో...

# అతిభారీ వర్షాలు

సంగారెడ్డి, వికారాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కొనసాగుతాయని చెప్పింది. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం, హన్మకొండ, జనగాం, ఖమ్మం, మహబూబాబాద్, ములుగు, సిద్దిపేట, వరంగల్ జిల్లాల్లో అతిభారీ వర్షాలుంటాయని తెలిపింది.ఆదిలాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, ఆసిఫాబాద్, మంచిర్యాల, మెదక్, నల్గొండ, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, సూర్యాపేట, భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడే సూచనలున్నాయని పేర్కొంది. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు.. కొత్తగూడెం, హన్మకొండ, జగిత్యాల, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, కామారెడ్డి, మెదక్, ములుగు, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, వికారాబాద్, వరంగల్ జిల్లాల్లో భారీ వర్షాలు పడే సూచనలున్నాయని వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో అలెర్ట్ జారీ చేసింది వాతావరణశాఖ.

# కారుతో ఢీకొట్టిన గంజాయి స్మగ్లర్

## రెండు రౌండ్లు కాల్పులు

**టీ మీడియా,ఆగస్టు 17,నెల్లూరు :** పోలీసులను కారుతో ఢీ కొట్టిన గంజాయి స్మగ్లర్‌పై కాల్పులు జరిపిన ఘటన నెల్లూరులో కలకలం రేపింది. గంజాయి అక్రమ రవాణా జరుగుతోందన్న పక్కా సమాచారంతో ఈ తెల్లవారుజామున నగరంలోని ఎస్వీజీఎస్ కళాశాల వద్ద జాతీయ రహదారిపై పోలీసులు తనిఖీలు చేపట్టారు. రాజమహేంద్రవరానికి చెందిన బీకర ప్రకాష్ అలియాస్ సూర్యప్రకాష్ కారులో గంజాయి తరలిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో స్మగ్లర్ వాహనంతో వేగంగా పోలీసులను ఢీ కొట్టి పరారయ్యేందుకు ప్రయత్నించాడు. ఈ ఘటనలో కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. దీంతో బాలాజీనగర్ సీఐ సాంబశివరావు కారుపై రెండు రౌండ్లు కాల్పులు జరిపి స్మగ్లర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కారులో ఉన్న 22 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సమాచారం అందుకున్న ఈగల్ సెల్ ఐజీ రవి కృష్ణ, ఎస్పీ కృష్ణకాంత్‌లు ఘటనా స్థలాన్ని పరిశీలించి, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ ఫిరోజ్‌ను పరామర్శించారు.



## భారీ వర్షాలు కురిసే అవకాశం...

### -జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**టీ మీడియా ఆగస్టు 17,పెద్దపల్లి :** రానున్న 2 రోజుల పాటు పెద్దపల్లి జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం కురిసే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.వాతావరణ శాఖ సూచనల ప్రకారం బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా మన పెద్దపల్లి జిల్లాలో ఆగస్టు 18,19 తేదీలలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని,పెద్దపల్లి జిల్లాకు ఎల్లో అలర్ట్ జారీ చేయడం జరిగిందని అన్నారు.భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.నీటి వనరులలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని,ఎక్కడ ఎటువంటి ప్రమాదాలు జర్గకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## గృహ ప్రవేశ వేడుకలో పాల్గొన్న మాజీ ఎంపీ నామ

**టీ మీడియా,ఆగస్టు 17,ఖమ్మం :** కార్పొరేషన్, శ్రీ సత్య సాయి నగర్ వాస్తవ్యులు డాక్టర్ కుసుమరాజు రవి కుమార్, మాలతి దంపతుల నూతన గృహ ప్రవేశం వేడుక తో పాటుగా వారి కుమార్తెలు శ్రీ లక్ష్మి సాయి ప్రణీత, శ్రీ కృతి ఓణీల అలంకరణ కార్యక్రమం కూడా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు హాజరై దంపతులకు అభినందనలు తెలిపి నూతన గృహ ప్రవేశం చేసుకున్న రవి కుమార్, మాలతి దంపతులు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో సిరిసంపదలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. వారి కుమార్తెల శ్రీ లక్ష్మి సాయి ప్రణీత, శ్రీ కృతి లకు ఆశీర్వాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో కనకమేడల సత్యనారాయణ, గొడ్డేటి మాధవరావు, మోరంపూడి ప్రసాదరావు, రేగళ్ల కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.



## రెచ్చిపోయిన గంజాయి బ్యాచ్..

### -వ్యక్తిపై సర్జికల్ బ్లేడ్‌తో దాడి

**టీ మీడియా,ఆగస్టు 17,కుత్బుల్లాపూర్ :** కుత్బుల్లాపూర్‌లో గంజాయి బ్యాచ్ రెచ్చిపోయింది. గంజాయి బ్యాచ్‌ని పట్టుకునేందుకు వచ్చిన హైదరాబాద్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసుల సమక్షంలో ఓ యువకుడిపై సర్జికల్ బ్లేడ్‌తో జరిగిన దాడి సంచలనంగా మారింది. కాగా ఇదే ఘటనపై గాయాల పాలైన భాదితుడి కుటుంబ సభ్యులు, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జీడిమెట్ల పోలీస్టేషన్‌లో ఫిర్యాదులు చేసిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఇరువురు స్థానిక పోలీస్టేషన్‌లో చేసిన ఫిర్యాదుల ఆధారంగా.. ఈ నెల 16న రాత్రి సమయంలో కుత్బుల్లాపూర్ అయోధ్య నగర్‌లో హాష్ ఆయిల్ గంజాయిని విక్రయిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు హైదరాబాద్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్ మెంట్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.కోటమ్మ నేతృత్వంలో దాడులు చేపట్టారు. ఈ దాడిలో హేమంత్, నితిష్, రవితేజా, చరణ్‌ను విచారిస్తున్న క్రమంలో కుత్బుల్లాపూర్ వెంకటేశ్వర నగర్ కాలనీకి చెందిన బి.చంటియాదవ్(28) తన పనులు ముగించుకొని అటువైపు నుండి వస్తుండగా పోలీసులకు గంజాయి విక్రయదారులకు మధ్య జరుగుతున్న పెనుగులాటలో జోక్యం చేసుకోవడంతో అకస్మాత్తుగా చంటియాదవ్ తలభాగంలో చెవిపై సర్జికల్ బ్లేడ్‌తో దాడి జరిగింది. తీవ్ర రక్తస్రావం కావడంతో స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా 15 కుట్లు పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.


**జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో పరస్పర ఫిర్యాదు**

ఇదే ఘటనపై జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో భాదిత కుటుంబంతో పాటు హైదరాబాద్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.కోటమ్మలు ఇచ్చిన ఫిర్యాదులు తీవ్ర చర్చానీయంశంగా మారింది. గాయాలపాలైన భాదితుడి అన్న ప్రవీన్ కుమార్ ఎక్సైజ్ అధికారులు గంజాయి బ్యాచ్‌కు వత్తాసు పలుకుతూ తమ సోదరుడు చంటిపై దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కాగా విధినిర్వాహణలో తమ విధులకు పూర్తిగా ఆటంకం కలిగించారని హేమంత్, నితిష్, రవితేజా, చరణ్‌తో పాటు ఇతరులపై ఇన్‌స్పెక్టర్ సిహెచ్. కోటమ్మ ఫిర్యాదు చేసింది.

**ఇన్‌ఫార్మర్ అనే నేపంతో దాడి**

కాగా భాదితుడు పోలీసులకు ఇన్‌ఫార్మర్‌గా పని చేస్తున్నాడని, తమ గుట్టును పోలీసులకు చేరవేయడంతోనే గంజాయి బ్యాచ్ ఈ దాడికి పాల్పడ్డారా అనే ప్రశ్నలు స్థానికంగా వెల్లువెత్తుతున్నాయి. అయితే సర్జికల్ బ్లేడ్లు గంజాయి బ్యాచ్ వద్దనే ఉంటాయో తప్పా పోలీసుల వద్ద ఎందుకు ఉంటాయని, పోలీసుల సమక్షంలోనే ఈ దాడి జరిగినప్పుడు గంజాయి బ్యాచ్‌ని ఎందుకు పట్టుకోలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ ఈ సంఘటనపై ఇటు పోలీసుల అత్యుత్సాహంతో పాటు అటు గంజాయి బ్యాచ్ ఆగడాలే ఈ సంఘటనకు దారితీశాయంటూ పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కాగా ఇదిలా ఉండగా జీడిమెట్ల పోలీసులు తమకేమి తెలియదన్న చందనంగా ఇరువురు ఎఫ్‌ఐఆర్ కాఫీలు మీడియా గ్రూప్‌లో పోస్ట్ చేయడం గమనార్హం. ఇతర సంఘటనలు జరిగిన సమయంలో ఎఫ్‌ఐఆర్ కాఫీలను బహిర్గతం చేయకుండా ఉండే పోలీసులు ఈ సంఘటనతో నేరుగా ఇరువురికి సంబంధించిన ఎఫ్‌ఐఆర్ లు బహిర్గతం కావడం విశేషం.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎంపీ నామ



**టీ మీడియా,ఆగస్టు 17,%-%ఖమ్మం:** బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఆదివారం ఖమ్మం కార్పోరేషన్, బోనకల్ రోడ్‌లోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన వివాహ వేడుకకు హాజరయ్యారు. ఖమ్మం లెనిన్‌నగర్‌కు చెందిన బొడ్లపాటి నాగేశ్వరరావు-కరుణ దంపతుల కుమారుడు సాయి చరణ్ వివాహం, హైదరాబాద్ వాస్తవ్యులు దాములూరి కృష్ణారావు-నాగేంద్రమణి దంపతుల కుమార్తె వైష్ణవితో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా నామ నూతన వధూవరులను ఆశీర్వదించి, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, పిల్లల పాపలతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. నామ వెంట కనకమేడల సత్యనారాయణ, గొడ్డేటి మాధవరావు, మోరంపూడి ప్రసాద్ రావు, మారెడ్డి వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సై పై సస్పెన్షన్ వేటు





**టీ మీడియా,ఆగస్టు 17,నీల్వాయి :** మంచిర్యాల జిల్లా నీల్వాయి పోలీస్ స్టేషన్ ఎస్సై ఈ.సురేష్ పై సస్పెన్షన్ వేటు పడింది. భార్యాభర్తల మధ్య తలెత్తిన వివాదంలో జోక్యం చేసుకున్న ఆయన,బాధితుడిని లంచం కోరినట్లు ఆరోపణలు వచ్చాయి. లంచం ఇవ్వలేదనే కారణంతో బాధితుడిని చితిక బాధలంతో బాధితుడు అల్గం కిష్టయ్య ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు దర్యాప్తు జరిపి,ఆరోపణలు నిజమని నిర్ధారించడంతో ఎస్సై సురేషన్ను సస్పెండ్ చేసినట్లు అధికారులు తెలిపారు. నెల రోజుల క్రితమే నీల్వాయి పోలీస్ స్టేషన్కి బదిలీ అయిన సురేష్,వివిధ అనవసర విషయాల్లో జోక్యం చేసుకోవడంతో పాటు పలువురిని చితకబాదినట్లు బాధితులు తెలపడంతో ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

## కాలేజీ అమ్మాయిలను ట్రాప్ చేసి పెళ్లి

### -ప్రైవేటు వీడియోలతో బ్లాక్‌మెయిల్

**టీ మీడియా,ఆగస్టు 17,హైదరాబాద్ :** లో నిత్య పెళ్లికొడుకు బాగోతం బయటపడింది. ప్రేమ పేరుతో కాలేజీ అమ్మాయిలకు వలవేసి, వారిని పెళ్లి చేసుకుని మోసం చేశాడు. అలా ముగ్గురు అమ్మాయిలను పెళ్లి చేసుకున్న యువకుడు.. వారి ప్రైవేటు వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్ చేశాడు. బాధిత యువతి హైదరాబాద్ అత్తాపూర్ పోలీసులను ఆశ్రయించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ అత్తాపూర్‌కు చెందిన రఫీ.. తన పేరును రవికుమార్‌గా పేరు మార్చుకుని కాలేజీ అమ్మాయిలకు వల వేసేవాడు. వారికి మాయమాటలు చెప్పి వారిని లోబరచుకునేవాడు. తన వలలో పడిన అమ్మాయిలను పెళ్లి కూడా చేసుకునేవాడు. అలా ముగ్గురు యువతులను పెళ్లి చేసుకున్న రఫీ అలియాస్ రవికుమార్.. వారితో సన్నిహితంగా ఉన్న సమయంలో వీడియోలు తీశాడు. అనంతరం ఆ ప్రైవేటు వీడియోలు చూపించి సదరు యువతులను బ్లాక్‌మెయిల్ చేయడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో రఫీ టార్చర్ తట్టుకోలేని ఓ యువతి

